కొసమెరుపు కథ

## బుద్ధిమంతుడు

"రాస్కెల్స్, ఇడియట్స్ అస్సలు బుద్ధి జ్ఞానము, సంస్కారము అస్సలు లేదు. ప్రపంచమే ఇలా ఏడ్చింది" అని చెప్తూ విసురుగా వ్యానిటీ బ్యాగ్ టేబిల్ మీద పడేసి, మంచం మీద వాలింది సుజన.

"ఏమిటే అంత విసురుగా వచ్చి ఎవరినో తిడ్తున్నావు? ఏమైంది?" కామాక్షమ్మ వచ్చి అడిగింది.

"ఏమిటి సుజా, ఏదో లెక్చరిస్తున్నట్లున్నావు?" అంటూ వచ్చాడు వినోద్.

"అన్నయ్యా నీవు బస్సులో ఇలాగే ప్రవర్తిస్తావా?"

"ఇలా అంటే ఎలా?"

"అదే ఆడవాళ్ళను తాకుతూ అసహ్యంగా, సంస్కార హీనంగా ప్రవర్తిస్తారు కొంతమంది"

"ఛఛ! నేనటువంటి వాడ్ని కాను. అమ్మా, చూడు సుజా నన్నెలా అవమానిస్తోందో"

"సర్దాగా అడిగానులే. నీవటువంటి వాడివి కావని తెలుసుగా" అని స్నానానికి వెళ్ళింది సుజన.

* * *

"కొంతమంది అబ్బాయిలు బస్సులో చాలా అసహ్యంగా ప్రవర్తిస్తారు" అన్నది కోమలి.

"అవును. అటువంటి వాళ్ళను నిలువునా నరికినా పాపం లేదు" అన్నది సుజన.

"ఒక అబ్బాయి బస్సులో అసహ్యంగా ప్రవర్తిస్తాడు, రోడ్డు మీద పాటలు పాడతాడు. చాలా సార్లు గమనించాను" అన్నది మాలతి.

వీళ్ళు ముగ్గురూ ఒకే కాలేజిలో క్లాస్‌మేట్స్. కాలేజి అయ్యాక బస్టాప్‌కివెళ్తూ మాట్లాడుకుంటున్నారు.

"ఆ అబ్బాయిని చూపించు. మనం ముగ్గురం కలసి ఆట పట్టిద్దాము" అన్నది సుజన.

వాళ్ళ ప్లాన్ ప్రకారం ఒక రోజు ముగ్గురూ బస్టాప్‌లో కలిసారు. ఆ అబ్బాయి రాలేదు కాని బస్సు వచ్చింది. ముగ్గురూ ఎక్కారు.

సుజన డ్రైవర్ దగ్గరగా అడ్డంగావున్న రాడ్ పట్టుకొని నిల్చుంది. కోమల, మాలతి కొద్దిగా వెనకాల నిల్చున్నారు.

దిగకముందే మాలతి ఆ అబ్బాయి తన వెనకాలే వున్నాడని కోమలితో మెల్లిగా చెప్పింది. కోమలి సుజన చెవిలో వేసింది.

ముగ్గురూ బస్సు దిగారు. ముగ్గురిలో మాలతి వెనకాల దిగింది. మాలతిని తాకుతూ ఆ అబ్బాయి వెనకాలే దిగాడు.

"ఎవడా వెధవ చూద్దాం" అనుకొని గబగబా వచ్చిన సుజన షాక్ తిన్నది.

అప్పడే మాలతి చెంపదెబ్బ తిన్న వినోద్ చెల్లెలి వంక చూడలేక తలవంచుకున్నాడు!

\- డాక్టర్ షహనాజ్ బతుల్



## అభిమాని

బొంబాయి పోలీసులు ఈమధ్య మెమన్ ఇంటిని సోదాచేస్తుంటే కొన్ని ఫోటోలు దొరికినాయట. వాటిలో మెమన్ సినీ నటీనటులతో దిగిన ఫోటోలను పోలీసులు సీజ్ చేశారు. ఎక్కువ ఫోటోలు జాకీషరాఫ్, మెమన్ కలిసి దిగినవి వున్నాయట... జాకీని ప్రశ్నిస్తే మెమన్ నా అభిమాని... అభిమానులతో ఫోటోలు చాలా దిగుతాం! అని సమాధానం చెప్పాడట. 'అసలు రహస్యం మెల్లగా బయటపడుతుంది!'


\- కృష్ణాజీ

## రెండు జన్మలు

"అయ్యా! నేనో పిల్లిని చంపాను. వచ్చే జన్మలో నేను మూర్ఖుడనయి పుడతానటగా" రంగడు ఓ స్వామీజీని అడిగాడు.

"దేవుడు రెండు జన్మల్లో ఒకేలా పుట్టించడురా" తాపీగా సమాధానమిచ్చారా స్వామిజి.

\-మీర్ మహిది అలి, హైదరాబాద్




## అర్హత




"నీకు మంత్రి పదవి కావాలంటే నువ్వు అసలయిన రాజకీయ నాయకుడవని నిరూపించుకోవాలయ్యా! ఇంతకూ నువ్వు ఏ నియోజకవర్గం నుండి గెలిచావ్!" అడిగాడు ముఖ్యమంత్రి.

"ఏమోసార్, గుర్తుకొచ్చి చావట్లేదు" నసిగాడు ఆ ఎం.ఎల్.ఎ.

"వెరీగుడ్. నీకు మంత్రి పదవి ఇస్తున్నా పో" అన్నాడు ముఖ్యమంత్రి.

\- డాక్టర్ ఆళ్ళ లక్ష్మీ రమణమూర్తి